క్లుప్తంగా

సర్వీసు రహదారిపై ప్రయాణించాలి


కలపర్రు టోల్‌ప్లాజా వద్ద భవానీ భక్తులకు అల్పాహారం అందజేస్తున్న పోలీసులు

పెదపాడు: భవానీ భక్తులు సర్వీసు రహదారిపై ప్రయాణించాలని ఏలూరు అదనపు ఎస్పీ ఎస్.సూర్యచంద్రరావు తెలిపారు. ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ ఎస్.సూర్యచంద్రరావు ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ కాలినడకన వెళుతున్న భవానీ భక్తులకు నీరు, అల్పాహారం, మజ్జిగ కలపర్రు టోల్ ప్లాజా వద్ద స్వయంగా సూర్యచంద్రరావు అందజేశారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని పలు ప్రాంతాల నుంచి విజయవాడకు వెళుతున్న భవానీ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు ఈ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పెదవేగి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాజశేఖర్ డీటీఆర్పీ మధు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


శివపార్వతులకు పూజలు చేస్తున్న భక్తులు

భీమడోలు: పూళ్ల, ఎంఎంపురం గ్రామాల ఇలువేల్పు భవానమ్మ ఆలయంలో బుధవారం శివ పార్వతుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నూతన ఉత్సవ విగ్రహాలను నెలకొల్పి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ప్రాచీన చరిత్ర కలిగిన భవానీ ఆలయంలో స్వయంభుగా శివలింగం ఉంది. అయితే పరమ శివుడు, భవానీ మాతలు కొలువై ఉన్నందున ప్రతి ఏటా ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఆలయ ఉత్సవ కమిటి సభ్యులు, పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

150 మందికి కంటి వైద్య పరీక్షలు


పెదపాడు మండలంలోని కొత్తూరులో ఉచిత వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య నిపుణులు

పెదపాడు: కంటి చూపు లేకపోతే జీవితం అంధకారం అవుతుందని కంటి వైద్యులు హేమలత తెలిపారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో కమ్యూనిటీ హాల్‌లో రవి కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. షుగర్ వ్యాధి కారణంగా కంటి చూపు తగ్గే అవకాశం ఉందన్నారు. కంటి చూపు తగ్గిన వెంటనే కంటి వైద్యులను సంప్రదించాలని చెప్పారు. 150 మందికి ఆత్యాధునిక టెక్నాలజీ పరికరాలతో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానికులు దన్నే శేషగిరి, సీహెచ్ దుర్గారావు, దన్నే అశోక్, సీహెచ్ శ్రీనివాసరావు, తోళం గణేష్, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధునికి సన్మానం


శతాధిక వృద్ధుడిని సత్కరిస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

ఉంగుటూరు: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా కైకరంలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త జటవల్లభుల జగన్నాథాన్ని మానవత సంస్థ ప్రతినిధులు బుధవారం సత్కరించారు. ఈయన వందవ సంవత్సరంలోకి అడుగు పెడుతున్నారు. కార్యక్రమంలో మానవత మండల అధ్యక్షుడు కోనే వీర వెంకట సత్యనరాయణ, రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి, పుసులూరి ప్రకాష్, శీతాల సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.


లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

జంగారెడ్డిగూడెం: ఏజెన్సీ మెట్ట ప్రాంతాల్లో జంగారెడ్డిగూడెం లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 100 మంది పారిశుద్ధ్య కార్మికులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నూతన దుస్తులు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట రమణ, సీఐ సుభాష్, లయన్స్ క్లబ్ నాయకులు అట్లూరు సురేష్, మద్దిపాటి నాగేశ్వరరావు, పంతగాని వెంకన్న, కన్నం హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

మహిషాసురమర్దనీగా అమ్మవారి దర్శనం


నిడమర్రు: రాజరాజేశ్వరిగా అమ్మవారు


భీమడోలు: మహిషాసురమర్దనీగా భవానమ్మ


పెదపాడు: పార్వతీదేవి


దెందులూరు: మహిషాసురమర్దనీ అలంకరణలో అమ్మవారు


గణపవరం: మహిషాసురమర్దనీగా కనకదుర్గమ్మ


భీమడోలు: విశేష పూజలందుకుంటున్న అమ్మవారు

- అమ్మవారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు
- ఉదయం నుంచి ఆలయాల్లో కుంకుమ పూజలు

భీమడోలు: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పదో రోజైన బుధవారం మహర్నవమిని పురస్కరించుకుని ఆలయాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, ఎంఎంపురం, కురెళ్లగూడెం, నరెడ్లగూడెం తదితర గ్రామాల్లో తెల్లవారు జాము నుంచి భక్తులు విశేష పూజలు చేశారు. ఆయుధ పూజలు నిర్వహించారు. భీమడోలులోని రావిచెట్టు, పోస్టాఫీసు రోడ్డు, జంక్షన్‌లో ఉత్సవ విగ్రహాల వద్ద భక్తులు పూజలు చేశారు. గుండుగొలనులో శ్రీభ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో భ్రమరాంబికా దేవిని ఉదయం గాజులతో దర్శనమిచ్చారు. సాయంత్రం కాళికాదేవి అవతారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారులు లంకా శివకుమార్ శర్మ, లంకా శ్రీనివాస్ శర్మ సంయుక్త ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎంపురం భవానమ్మ ఆలయంలో మహిషాసురమర్దనీ అవతారంలో భక్తులకు దర్శనిచ్చారు. భీమడోలు జంక్షన్‌లో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కొలువైన అమ్మవారు భక్తుల పూజలందుకున్నారు. నరెడ్లగూడెంలోని గద్దెపై వేంచేసియున్న అమ్మవారికి భక్తులు పూజలు చేశారు. ఆలయ పూజారి వర్ధినేడి కపిరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా దసరా మహోత్సవాలు

దెందులూరు: మండలంలో దసరా మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు, ప్రదక్షిణలు చేశారు. గోపన్నపాలెం కనకదుర్గమ్మ ఆలయంలో బుధవారం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ ఆలయ కమిటీ కొండేటి హనుమంతు, తోట రామకృష్ణ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అతిథులను సత్కరించి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. నాయకులు గారపాటి రామసీత, యూఎస్ రాంప్రసాద్, మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు), యలమర్తి శ్రీనివాసరావు, చందు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి మహిషాసురమర్దనీ అలంకరణ

శ్రీరామవరంలో రైస్‌మిల్ పక్కన కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దనీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు ముగ్గురు 40 కేజీల 15 రకాల కూరగాయలను ఐదు గంటలు శ్రమించి ప్రత్యేక అలంకరణ చేశారు.

దసరా శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే

లోకమాత దుర్గామాత ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ కలగాలని నియోజవర్గ ప్రజలు సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. దసరా మహోత్సవాల సందర్భంగా బుధవారం ఆయన కార్యాలయంలో విడుదల చేసిన ప్రకటనలో దుర్గామాత వేడుకలను వాడవాడలా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటున్నారని ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు

పెదపాడు: మండలంలోని పెదపాడులో గంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పసుపు కుంకుమలతో అర్చనలు చేశారు. ఆలయ అర్చకులు నౌలూరి మణి దీప పూజలు నిర్వహించారు. అట్లూరి రవికుమార్ దంపతులు అమ్మవారికి బుధవారం పూజలు నిర్వహించారు. సుగ్గల రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

మహిషాసురమర్దనీగా కనకదుర్గమ్మ

గణపవరం: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు మహిషాసురమర్దనీ అలంకరణలో భక్తులకు దర్శమిచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. మంగళవారం అమ్మవారిని మహిషాసురమర్దనీగా అలంకరించి పూజలు నిర్వహించారు. గణపవరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి వర్తక సంఘ భవనంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాసవీమాతకు ప్రత్యేక అలంకరణ చేసి, కుంకుమ పూజలు చేశారు. చిన రామచంద్రపురం కనకదుర్గమ్మకరు మహిషాసురమర్దనీ అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. బాలయ్య చెరువు వద్ద కంచి కామాక్షి కనకదుర్గమ్మ ఆలయం, బస్టాండ్ వద్ద, సలాదివారి వీధి, పిప్పర కనకదుర్గమ్మను ప్రత్యేక అలంకరణ చేశారు.

రాజరాజేశ్వరిగా దుర్గామాత

నిడమర్రు: మండంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభంవగా నిర్వహిస్తున్నారు. పెదనింద్రకొలను, నిడమర్రు, పత్తేపురం, బువ్వనపల్లి, మందలపర్రు గ్రామాల్లో దుర్గమ్మ రాజరాజేశ్వరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం దసరా సందర్భంగా ఆయా ఆలయాల్లో ఉదయం నుంచి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించడానికి కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

పోలీసుల సూచనలు పాటించండి


కలపర్రు టోల్ ప్లాజా వద్ద ప్రచార వాహనాలను విడుదల చేస్తున్న పోలీసు సిబ్బంది

పెదపాడు: పోలీసుల సూచనలు పాటించి ప్రమాదాలు, దొంగతనాలు జరగకుండా చూడాలని పెదవేగి సీఐ సీహెచ్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం పెదపాడు మండలంలోని కలపర్రు టోల్ ప్లాజా వద్ద మైక్ వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర, రాజస్థాన్ వంటి ప్రాంతాలకు చెందిన దొంగల ముఠాలు సంచరిస్తున్నట్లు దొంగతనాలు జరుగుతున్నాయని విస్తృత ప్రచారం నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అనుమానస్పద రీతిలో ఎవరైనా సంచరిస్తే 112 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. పెదపాడు ఎస్సై 9440796635, దెందులూరు ఎస్సై 9440796654, పెదవేగి సీఐ 9440696637 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

ఉజ్జీవ ఉపవాస ప్రార్థనలు


ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు

దెందులూరు: విశ్వాసులు ఉపవాసంతో ప్రార్థనలు చేయటం ఆశీర్వాదకరమని పాస్టర్ యెషయ్య అన్నారు. బుధవారం దెందులూరు యాదవుల వీధి రైస్‌మిల్ ఎదుట ఎరూషలేము ప్రేయర్ మినిస్ట్రీస్ పాస్టర్ గ్రేస్ రాణి సంఘస్తుల ఆధ్వర్యంలో మూడు రోజుల ఉజ్జీవ ఉపవాస ప్రార్థనలు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాస్టర్ యెషయ్య మాట్లాడుతూ క్రైస్తవులు దేవుని ఆజ్ఞలు జీవన విధానానికి అనుగుణంగా ఆదర్శవంతంగా జీవించాలన్నారు.

జిల్లా మహా సభలపై ప్రచారం

దెందులూరు: రైతుల సమస్యలు శాశ్వత పరిష్కారానికి ప్రణాళిక కోసం రైతు సంఘం జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం దెందులూరులో జిల్లా ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30, 31 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో ఏపీ రైతు సంఘం జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా రైతులు అధిక సంఖ్యలో హాజరై జిల్లా మహా సభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మహాత్మా.. మన్నించు!


గాంధీ వేషధారణలో చిన్నారి


అలసిపోయి కునుకు తీస్తున్న బాలగాంధీ

గణపవరం: ఓ మహాత్మా..మన్నించు నీవు మన దేశానికి స్వాతంత్య్రం తెచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తుంది. స్వాంతంత్రం వస్తే మన దేశంలో అందరికీ కూడు, గూడు, గుడ్డ సమకూరుతాయని నీవు కలలుగన్నావు. మన పాలకుల అసమర్థత, అవినీతి, స్వార్థం నీ కలలు నెరవేకుండా అడ్డు పడుతున్నట్లుంది. అందుకే ఈ నాటికీ దేశంలో పేదరికం జాడ ఇంకా కనిపిస్తూనే ఉంది. పొట్టకూటి కోసం నీ వేషధారణలో ఎంతో మంది జీవనం సాగిస్తున్నారు. చివరికి అభం శుభం తెలియని చిన్నారులను కూడా వదలకుండా నీ వేషధారణతో బిక్షాటన చేయిస్తూ పొట్ట పోసుకుంటున్నారు. బడిలో అక్షరాలు దిద్దాల్సిన వయసులో కుటుంబ పోషణ బాధ్యతలు నెత్తికెత్తుకున్న బాల్యం రోడ్ల మీదే కరిగిపోతుంది. అందుకే ఓ బాపూ.. మమ్మల్ని క్షమించు.

చిన్నారులకు టీకాలు వేయించాలి


చిన్నారులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

దెందులూరు: చిన్నారులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని గోపన్నపాలెం పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఓ సత్యనారాయణ అన్నారు. బుధవారం దెందులూరు అంగన్‌వాడీ కేంద్రం–1లో చిన్నారులకు టీకాలను ఏఎన్ఎం సుభాషిని సిబ్బంది వేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది తల్లిదండ్రులకు చిన్నారుల వ్యాధుల లక్షణాలపై అవగాహన కల్పించారు

రేపు భూముల రీసర్వే

నిడమర్రు: మండలంలోని సిద్ధాపురం, బైనేపల్లి గ్రామాల్లో భూములు శుక్రవారం రీసర్వే చేస్తున్నట్లు తహసీల్దార్ బి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటలకు సిద్ధాపురం గ్రామ పంచాయతీ వద్ద, మధ్యాహ్నం 3 గంటలకు బైనేపల్లి గ్రామ పంచాయతీ వద్ద గ్రామ సభలు ఏర్పాటు చేశామన్నారు. ఆయా గ్రామాల్లో గ్రామసభలు అనంతరం రీసర్వేపై అవగాహన ర్యాలీలు నిర్వహిస్తామన్నారు.

జీఎస్టీ సంస్కరణలపై అవగాహన


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

దెందులూరు: జీఎస్టీ సంస్కరణల ఫలాలు ప్రతి కుటుంబానికి అందించాలని సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ కార్యక్రమాల నిర్వహణ ప్రధాన ఉద్దేశ్యమని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. దెందులూరు మండలం గోపన్నపాలెంలోని ప్రభుత్వ వ్యాయమ కళాశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్, నాగార్జునరావు, జాయింట్ డైరెక్టర్ వి.దుర్గా ప్రసన్నబాబు, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి, వ్యవసాయ శాఖాధికారి హబీబ్ భాషా, మైక్రో ఇరిగేషన్ అధికారి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీతో ప్రజలకు మేలు

ఉంగుటూరు: జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూరిందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉంగుటూరులో జీఎస్టీపై అవగాహన ర్యాలీ, సమావేశం నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, ఏఎంసీ చైర్మన్ సూరత్తుల అయ్యప్ప వ్యవసాయ అధికారులు ప్రవీణ్ కుమార్, ఉష, ఆశీర్వాదం, ఎంపీడీవో రాజీమనోజు, తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఆర్థిక భరోసా జీఎస్టీ

భీమడోలు: జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ఆర్థిక భరోసా కలిగిందని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతీదేవి అన్నారు. భీమడోలు రైతుసేవా కేంద్రం వద్ద బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో ఉషారాణి, పెద్దలు కరణం పెద్దిరాజు, దూనవపూడి పుల్లయ్య, కుక్కల ప్రసాద్, యుగంధర్, ప్రవీణ్ కుమార్, ఆదిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం ఎన్ఎంఎంఎస్

15 వరకు దరఖాస్తు గడువు


విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ మెటీరియల్ అందజేస్తున్న దాత (ఫైల్)

గణపవరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఆర్థిక భరోసా కల్పించడానికి ఏటా కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మెరిట్ కం మీన్స్ స్కీం)కు దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఈ నెల 15వ తేదీ వరకు పెంచడం విద్యార్థులకు వరం. తొలుత ఈ గడువు సెప్టెంబర్ 30వ తేదీతో ముగిసినా పలు రాష్ట్రాల్లో దసరా సెలవుల కారణంగా చాలా మంది పిల్లలు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోలేకపోవడాన్ని గుర్తించిన కేంద్రం దరఖాస్తు చేసుకోవడానికి గడువును అక్టోబర్ 15వ తేదీ వరకూ పొడిగించింది. ఈ పరీక్షకు హాజరయ్యే వారిలో ఎక్కువ మంది గ్రామీణ ప్రాంత విద్యార్థులే కావడం వారికి ఇంటర్‌నెట్ సదుపాయం అందుబాటులో లేకపోవడం, స్మార్ట్ ఫోన్లలో దరఖాస్తు చేయడంపై సరైన అవగాహన లేకపోవడం, దరఖాస్తు చేయడానికి అవసరమైన కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు సకాలంలో అందకపోవడం, తదితర కారణాలతో విద్యార్థులు గడువులోగా దరఖాస్తు చేసుకోలేక తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. మంగళవారం రాత్రి దరఖాస్తు గడువు పెంచడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక భరోసా

ఎన్ఎంఎంఎస్ పరీక్షలో అర్హత సాధిస్తే విద్యార్థులకు ఆర్థికంగా భరోసా లభిస్తుంది. అర్హత సాధించిన వారికి కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు రూ.48 వేలు ఆర్థిక సాయం అందజేస్తుంది. అయితే వీరు నాలుగేళ్ల పాటు చదివితేనే సహాయం అందుతుంది. ఇందు కోసం ప్రతి ఏటా ఆయా విద్యా సంస్థ నుంచి ప్రధానోపాధ్యాయుడు, ప్రిన్సిపాల్ ధృవీకరణ చేసి రెన్యువల్ చేయాల్సి ఉంటుంది.

180 మార్కులకు పరీక్ష

ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్ష రెండు విభాగాలుగా ఉంటుంది. తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో పరీక్ష నిర్వహిస్తారు. విద్యార్థులు తమకు ఇష్టమైన భాషను ఎంచుకోవచ్చు. మొదటి విభాగంలో అభ్యర్థుల సామర్థ్యాలను అంచనా వేసే మెంటల్ ఎబిలిటీ, రీజనింగ్‌పై పరీక్ష ఉంటుంది. రెండో విభాగంలో 7, 8 తరగతుల సైన్సు, సోషల్, గణితంలో ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో విభాగానికి 90 మార్కుల చొప్పున మొత్తం 180 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.

ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి



ఎన్ఎంఎంఎస్ పరీక్షకు ఎక్కువ మంది విద్యార్థులతో దరఖాస్తు చేయించడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ప్రస్తుతం ఈ నెల 15వ తేదీ వరకు గడువు పెంచినందున ఉపాధ్యాయులు ఈ విషయంపై దృష్టి సారించాలి. గత ఏడాది బువ్వనపల్లి హైస్కూలు నుంచి ఇద్దరు, నిడమర్రు హైస్కూలు నుంచి ఒకరు, పెదనింద్రకొలను హైస్కూలు నుంచి 9 మంది ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్పుకు అర్హత సాధించారు. ఈ ఏడాది ఎక్కువ మంది విజయం సాధించేలా ప్రత్యేక తరగతుల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాం.

– అనూరాధ, ఎంఈవో–1

దరఖాస్తు ఇలా..

రాష్ట్ర ప్రభుత్వ సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. గతంలో దరఖాస్తు సమయంలోనే ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు అప్‌లోడ్ చేసి, పరీక్ష ఫీజు ఆ రోజే ఆన్‌లైన్‌లోనే చెల్లించాల్సి ఉండేది. కాని ఈ ఏడాది కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు దరఖాస్తుతో పాటు అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదు. పరీక్ష తేదీ నాటికి వీటిని సిద్ధం చేసుకోవచ్చు. పరీక్ష ఫీజు కూడా ఈ నెల 16వ తేదీలోగా చెల్లించే వెసులుబాటు కల్పించారు. దరఖాస్తు చేసేసమయంలో విద్యార్థి ఫొటో, వ్యక్తిగత వివరాలు ఉంటే సరిపోతుంది. పరీక్ష ఫీజు ఓసీ, బీసీలకు రూ.100, ఎస్సీ, ఎస్టీలు రూ.50 చెల్లించాలి. దరఖాస్తుదారు కుటుంబ ఆదాయం ఏడాదికి రూ.3.50 లక్షల లోపు ఉండాలి. పరీక్ష డిసెంబర్ 7వ తేదీన ఉంటుంది.

నాయక కులస్తుల సమస్యలు పరిష్కరించాలి

కామవరపుకోట: ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వాలని పది రోజులుగా నాయక కులస్తులు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని కమ్యూనిస్టు నాయకులు టీవీఎస్ రాజు అందుగుల ఫ్రాన్సిస్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నాయక కులస్తులు ఎంతో కాలంగా ఎస్టీ సర్టిఫికెట్లు తీసుకుంటున్నారని ఇప్పుడు ఆ సర్టిఫికెట్లను ఆపడం దారుణమని ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.